క్లుప్తంగా

12న మండల సమావేశం

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం మండల సర్వసభ్య సమావేశం స్థానిక పరిషత్ సమావేశ హాలులో ఈ నెల 12వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సీహెచ్ రామచంద్రరావు తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. అదేవిధంగా అన్ని శాఖల అధికారులు పూర్తిసమాచారంతో సమావేశానికి రావాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి



కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ కొండారెడ్డి

సీఎస్‌పురం(పామూరు): భోజనంలో మెనూ పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. సీఎస్‌పురం కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నభోజన నాణ్యతను పరిశీలించారు. ఇటీవల మధ్యాహ్న భోజనం వండే వంట ఏజెన్సీలకు శిక్షణ ఇచ్చామన్నారు. ప్రభుత్వం పీఎం పోషన్ మధ్యాహ్న భోజనాన్ని చాలా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. పాఠశాలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి విధిగా పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం తినేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఏపీసీపీడీసీఎల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి

ఉలవపాడు: విద్యుత్ బిల్లుల చెల్లింపుకు ఏపీసీపీడీసీఎల్ కంజ్యూమర్ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. గతంలో ఆన్‌లైన్ చెల్లింపులు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం ద్వారా వినియోగదారులు చేసి ఉన్నారని, ఇప్పుడు ఆ యాప్‌ల్లో బిల్లులు చెల్లించడం కుదరదని తెలిపారు. వినియోగదారులు గమనించి ఈ యాప్ ద్వారా బిల్లులు చెల్లించాలని కోరారు.

విద్యుత్ బిల్లులు ఏపీసీపీడీసీఎల్ యాప్‌లో చెల్లించాలి

మద్దిపూడి: ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించిఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం తదితర యూపీఐ యాప్‌ల ద్వారా నేరుగా విద్యుత్ బిల్లులు చెల్లించే సేవలను ఈ నెల నుంచి నిలిపివేసినట్లు ఆ శాఖ ఏఈ రామకృష్ణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీసీపీడీసీఎల్ యాప్‌లో బిల్లులు చెల్లించాలని సూచించారు. డిస్కం యాప్ ద్వారా యూపీఐ పేమెంట్ చేయవచ్చని పేర్కొన్నారు. అలాగే డెబిట్, క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాష్‌కార్డు ద్వారా బిల్లులు చెల్లించే అవకాశం ఉందని వెల్లడించారు.

వలంటీర్ల ఛలో విజయవాడ భగ్నం

సింగరాయకొండ: గ్రామ వలంటీర్ల రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు బుధవారం తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వలంటీర్లపై నిఘా ఉంచారు. వలంటీర్లలో కీలకంగా వ్యవహరించే కొందరిని ఎంపిక చేసుకుని వారి ఇళ్ల వద్దకు పోలీస్ సిబ్బందిని పంపి కౌన్సెలింగ్ ఇచ్చారు. విజయవాడ వెళ్తే ఇబ్బందులు ఎదుర్కొంటారని, ఆ ప్రయత్నాలను విరమించుకోవాలని హెచ్చరించారు. పోలీసులు కూడా తాము వలంటీర్లకు కౌన్సెలింగ్ ఇచ్చామని స్పష్టం చేయడం గమనార్హం.

నీటి వృథాను నియంత్రించాలి

ఒంగోలు: స్థానిక అంజయ్యరోడ్డులో దుర్గా నర్సింగ్ హోం ఎదురుగా మంచినీటి పైపులైన్ దెబ్బతిని చాలానీరు వృథాగా పోతోంది. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి అరికట్టాలని ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై అనేక మార్లు స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపాలని సుబ్బారావు కోరారు.

సయ్యద్ షహనాజ్‌కు డాక్టరేట్

ఒంగోలు మెట్రో: సూర్య దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు సయ్యద్ షహనాజ్‌కు ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. గత నెల 29న బెంగళూరులోని యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో షహనాజ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసి అవార్డు కింద రూ.52,000 అందజేశారు. ఎంతోమంది దివ్యాంగులకు వసతి కల్పించి వారి బాగోగులను ఆమె చూసుకుంటున్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో తన భర్త షేక్ సర్దార్‌బాషాతో కలిసి విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితిలోనూ షహనాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంతో మందికి భోజన వసతి కల్పించారు. ఆమె సేవలను గుర్తించిన యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. షహనాజ్‌కు డాక్టరేట్ రావడంపై ఒంగోలులోని ప్రముఖులు అభినందనలు తెలిపారు.

ఆగని ఇసుక రవాణా



కూటాగుండ్ల వద్ద దోమలేరు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు



క్వారీలో నుంచి ఇసుకను ట్రాక్టర్లకు నింపుతున్న కూలీలు

● పట్టించుకోని అధికారులు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని దోమలేరు వాగులో ఇసుక దోపిడీ మొదలైంది. దోమలేటి వాగు ఇసుక మాసాయి పేట నుంచి కూటాగుండ్ల సీతారాంపురం, దొడ్డిచింతల, దాసళ్లపల్లి వరకు వాగులో క్వారీలు పెట్టి భారీగా తరలిస్తున్నారు. గత 15 ఏళ్ల నుంచి వాగు నుంచి భారీగా ఇసుకను తవ్వి సీసీ రోడ్లకు తరలించారు. వాగు అంతా ఎక్కడ పడితే అక్కడ భారీగా పెద్ద పెద్ద గుంతలు తీశారు. గత 15 సంవత్సరాల క్రితం కూటాగుండ్ల వద్ద దోమలేరు అలుగు వాగు రెండు కలిసే వద్ద ఇసుక క్వారీలో ఇసుక తీస్తూ చిన్నమల్లవరం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు ఇసుక కింద పడి మృ తి చెందారు. పెద్ద గొల్లపల్లి గ్రామానికి చెందిన మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఇటీవల కూటాగుండ్ల వాగు వద్ద ఇసుక తీస్తూ కూలీలు ఇసుక కింద పడటంతో పక్కనే ఉన్న వారు అప్రమత్తం కావడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం తిరిగి అదే ప్రాంతంలో క్వారీయింగ్ చేస్తూ ఇసుకను తరలిస్తున్నారు. వాగులో పెద్ద పెద్ద గుంతలు తీశారు. అధికారులు స్పందించి కూటాగుండ్లలో ఇసుక తవ్వకాలను ఆపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

● రూ.20 వేలు జరిమానా



పట్టుబడిన ట్రాక్టర్లతో సెబ్ అధికారులు

సింగరాయకొండ: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లకు 20 వేల రూపాయల జరిమానా విధించిన సంఘటన బుధవారం ఉదయం జరుగుమల్లి మండలం దావగూడూరు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. సెబ్ సీఐ నరహరి కథనం ప్రకారం.. జరుగుమల్లి మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు కె.శ్రీను, కె.ఆంజనేయులు ఇసుకను అనుమతి లేకుండా రవాణా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. మొదటిసారి కావడంతో ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించామని వివరించారు. సెబ్ ఎస్సై సీహెచ్ దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

గుడ్లూరు(కందుకూరు): మండలంలోని దప్పళంపాడు ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్సై లక్ష్మణరావు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అక్రమ ఇసుక రవాణా దారులు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలించవద్దని హెచ్చరించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఉలవపాడు: మన్నేరు నుంచి అక్రమంగా తరలివెళుతున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. మండల పరిధిలోని భీమవరం గ్రామ సమీపంలోని మన్నేరు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండడంతో ఎస్సై బాజిరెడ్డి సిబ్బందితో కలసి వెళ్లి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ అధికారులు బుధవారం పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండలంలోని అంగిరేకులపాడు వద్ద ఉన్న మన్నేరు వాగు నుంచి బుధవారం ఉదయం ఇసుకను తరలిస్తున్నట్లు సెబ్ అధికారులకు సమాచారం అందడంతో సెబ్ ఎస్సై దీప్తి కరంత్ సిబ్బందితో వెళ్లి పెదపవని గ్రామం వద్ద ఇసుక లోడుతో వెళుతున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సెబ్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.బాజీబాబు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కండి



పామూరులో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, బీజేపీ నేతలు

పామూరు: మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కొండిశెట్టి వెంకటరమణయ్య అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు అమ్మకోసం ఒకచెట్టు కార్యక్రమంలో భాగంగా బుధవారం పామూరులో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో, రోడ్ల వెంట మొక్కలనాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జాజం చిన్నసుబ్బయ్య, ఉమ్మడిశెట్టి శ్రీనివాసులు, దేవిశెట్టి పవన్‌కుమార్, ద్రోణాదుల వెంకట చరణ్, చల్లగండ్ల గోకుల్, బి.రమణాచారి పలువురు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



మహ్మదాపురంలో తాగునీటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

హనుమంతునిపాడు: మండల పరిధిలోని మహ్మదాపురం, పాఠశాలల్లో వైద్య సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ అధికారులు తాగునీటి పరీక్షలు నిర్వహియంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి ట్యాంకులు, కుళాయిల వద్ద పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వంటశాలలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవన్నారు. భోజనం చేసే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. అతిసార వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈఓఆర్డీ షేక్ షరీఫ్, కార్యదర్శిరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంపిణీకి విత్తనాలు సిద్ధం

పీసీపల్లి: మండలంలోని అన్ని ఆర్‌బీకే కేంద్రాల్లో విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయాధికారి వెంకటస్వామి తెలిపారు. రైతుల కోసం జీలుగ, జనుము, పిల్లి పెసరలు అందుబాటులో ఉన్నాయని, దరఖాస్తు చేసుకున్న వారికి పంపిణీ చేస్తామన్నారు. వర్షాలు కురిసే లోగా ఎవరికైనా అవసరముంటే దరఖాస్తు చేసుకుంటే మళ్లీ వస్తాయని చెప్పారు.


ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఈఓపీఆర్‌డీ, పీఎస్, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

పామూరు: పర్యావరణానికి అధిక ముప్పుగా మారిన సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని ప్రజలు పూర్తిగా నిషేధించాలని ఈఓపీఆర్‌డీ కేవీఎల్ శ్రీనివాసరావు, పీఎస్ వి.బ్రహ్మానందరెడ్డి అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధించాలని కోరుతూ బుధవారం స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు డాక్టర్ షేక్.నాయబ్‌రసూల్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల బదులు జూట్‌తో తయారు చేసిన కవర్లు, సంచులను వినియోగించాలన్నారు. తద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములై భావితరాలకు మేలు చేద్దామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఉత్తరరావు, పీడీ షేక్.మస్తాని, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రతాప్‌రెడ్డి, మండ్లా మల్లికార్జున, నాగిరసూల్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి



మెప్మా సిబ్బందితో మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: మెప్మా అధికారులు, సిబ్బంది మహిళా సంక్షేమం అభివృద్ధి పథకాలపై పొదుపు మహిళల్లో ప్రచారం చేసి, వారిని చైతన్యవంతులను చేసి ఆర్థికంగా బలోపేతం చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్ అన్నారు. స్థానిక మెప్మా కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ పట్టణ మెప్మా పరిధిలోని పొదుపు సంఘాలు, వాటి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. మెప్మా అధికారులు, సిబ్బంది, రిసోర్స్ పర్సన్‌లు పథకాల అమలులో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మహిళా అభివృద్ధిలో మెప్మా అధికారుల, సిబ్బందిదే కీలకపాత్ర అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు అత్యధిక ధర కేజీ రూ.360



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం పొగాకు అత్యధిక ధర రూ.360 పలికింది. మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాలకు చెందిన రైతులు 1025 బేళ్లను వేలానికి తీసుకురాగా 962 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 63 బేళ్లు తిరస్కరించారు. కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.305.70 పలికింది. వేలంలో మొత్తం 42 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపిలో రికార్డు ధర పలికిన పొగాకు

కొండపి(సింగరాయకొండ): కొండపి పొగాకు వేలం కేంద్రంలో బధవారం అత్యధిక ధర కేజీ రూ.362 పలికింది. కొండపి బోర్డు చరిత్రలోనే ఇది రికార్డు ధర అని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. సరైన గ్రేడింగ్ చేసిన పొగాకుకు అత్యధిక ధర పలుకుతుందన్నారు. బోర్డ్ పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు 1,183 బేళ్లు వేలానికి తీసుకురాగా అందులో 1085 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 98 బేళ్లను తిరస్కరించారు. కనిష్ట ధర రూ.204, సరాసరి ధర రూ.294.91 పలింది. వేలంలో 25 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

చిన్నారి ఆర్మన్ రూ.50 వేల సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

కందుకూరు: లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ విజయవాడలోని చిల్డ్రన్స్ రెయిన్‌బో హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న బాలుడు చిన్నారి ఆర్మన్ వైద్య చికిత్స కోసం దాతల నుంచి సాయం అందిస్తూనే ఉన్నారు. ఇప్పటికే పెద్ద మొత్తంలో సాయం అందించగా బుధవారం మరికొంత మంది దాతలు సాయం అందించారు. పట్టణంలోని ప్రముఖ వ్యాపారి సురేష్‌రెడ్డి చికెన్ సెంటర్ అధినేత సురేష్‌రెడ్డి ఇప్పటికే రూ.25వేల ఆర్థిక సాయం చేయగా, దుకాణంలో పనిచేసే సహాయ సిబ్బంది, మిత్రులు కలిసి మరో రూ.50వేల సాయాన్ని బుధవారం అందించారు. దాతలు అందించిన సాయంతో ఆర్మన్ త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.



పెదపవనిలో డయేరియాపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

లింగసముద్రం: డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచించారు. మండలంలోని పెదపవనిలో డెంగీ, డయేరియా నివారణపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డయేరియా, డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్లలో మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని, నిల్వ ఉన్న నీటిని తొలగించి శుభ్రంగా ఉండేటట్లు చూడాలన్నారు. డయేరియా నివారణకు జింక్ మాత్రలు వాడాలన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా డయేరియాను పారదోలవచ్చన్నారు. సురక్షితమైన నీటిని తాగడంతో పాటు పరిశుభ్రమైన తాజా ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా డయేరియాను దూరం చేయవచ్చన్నారు. ఏఎన్‌ఎం అంకమ్మ, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఐఈఏ వార్షికోత్సవాలు



వార్షికోత్సవంలో పాల్గొన్న ఉద్యోగులు

కందుకూరు: ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 74వ వార్షికోత్సవాలను స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, విద్యార్థులకు వివిధ పోటీలతో పాటు, వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యుల పర్యవేక్షణలో ఆయుర్వేదిక్, యునాని, హోమియో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరికీ జీవిత బీమా కల్పించడమే లక్ష్యంగా ఎల్‌ఐసీ పనిచేస్తుందని చెప్పారు. సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కాంతారావు, యూనియన్ ప్రెసిడెంట్ షేక్ షబ్బీర్, కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, సభ్యులు డీవీ రమణ, లక్ష్మీనారాయణ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతి హోమం



లక్ష్మీ గణపతి హోమంలో పాల్గొన్న దంపతులు, అర్చకులు

ఒంగోలు మెట్రో: క్రోధి నామ సంవత్సరం జేష్ఠ మాసం బుధవారం నగరంలోని గణపతి ఆలయాలలో అభిషేకాలు, అర్చనలు వైభవంగా నిర్వహించారు. స్థానిక పేర్నమిట్ట సిద్ధి బుద్ధి దేవస్థానంలో, కర్నూల్ రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న గణపతి ఆలయంలో, అద్దంకి బస్టాండ్ దగ్గర ఉన్న విజయ గణపతి దేవాలయంలో, బాపూజీ కాంప్లెక్స్ ఆవరణలో కొలువై ఉన్న వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో, నెల్లూరు బస్టాండ్ దగ్గరున్న సిద్ధి గణపతి దేవాలయంలో, రాజాపానగల్ రోడ్డులోని లక్ష్మీ గణపతి దేవస్థానంలో, శ్రీనగర్ కాలనీలోని సిద్ధి బుద్ధి సమేత గణపతి దేవాలయంలో, సమతా నగర్లోని కార్యసిద్ధి గణపతి దేవాలయంలో అర్చకులు ఉదయం ఏడు గంటలకు స్వామివారి మూల విరాట్‌కు సుగంధ పరిమళ ద్రవ్యాలు, పసుపు, కుంకుమ, గంధం, విభూది, చందనం, పన్నీరు, కొబ్బరి నీళ్లు, పాలు, పెరుగు, తేనె, చక్కెర, వివిధ రకాల పండ్ల రసాలతో పంచామృత అభిషేకం నిర్వహించారు. గణనాథునికి పంచ హారతులతో భక్తులకు దివ్య దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం పది గంటలకు లక్ష్మీ గణపతి దేవస్థానంలో అర్చకులు దంపతులతో భక్తిశ్రద్ధలతో లక్ష్మీ గణపతి హోమాన్ని నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీసులు అందుకున్నారు.

వేణుగోపాలుడికి పుష్ప యాగ మహోత్సవం



గోపాలుని పుష్ప పూజ నిర్వహిస్తున్న అర్చకులు

ఒంగోలు మెట్రో: క్రోధి నామ సంవత్సరం జేష్ఠ మాసం బుధవారం స్థానిక దక్షిణం బజారులో వెలసిన వేణుగోపాలస్వామి దేవస్థానంలో పుష్పయాగ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు మంగళ వాయిద్యాలతో ఆలయ అర్చకులు వేద మంత్ర పఠనం, విష్వక్సేన పూజ, పుణ్యాహం, రక్షాబంధనం, కుంభార్చన, ఋత్విగ్వరణము, మేదిని పూజ, అర్చన, నివేదన, హారతి, మంత్రపుష్పం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఆరు గంటలకు అఖండ దీపారాధన, మేదినీ పూజ, పుల్లంగి సేవను స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేసి పుష్ప యాగ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పుష్పయాగ మహోత్సవంలో పాల్గొన్న మహిళలు